క్లుప్తంగా

బోరు ఏర్పాటుకు భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి అనుసంధానం చేసి, ప్రజలకు తాగునీరు అందించేందుకు అవసరమైన బోరు ఏర్పాటు పనులకు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఈ బోరు తవ్వకపు పనులు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 30 మంది పయనం



కంటి ఆస్పత్రికి బయలుదేరి వెళ్తున్న రోగులు

గుమ్మలక్ష్మీపురం: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో కంటి ఆపరేషన్లకు ఎంపికైన 30 మంది నేత్ర శస్త్రచికిత్స నిమిత్తం కురుపాం సీహెచ్‌సీ నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం పయనమయ్యారు. వారందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయడంతో పాటు భోజనం, బస్సు ప్రయాణం, వసతి, మందులు, కళ్లద్దాలు అందించడం జరుగుతుందని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం



చెట్ల చుట్టూ కందకాలు తవ్వుతున్న వేతనదారులు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస, గరుగుబిల్లి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గొట్టివలస జీడిమామిడి తోటల్లో చెట్ల చుట్టూ కందకాల తవ్వకాలు చేపట్టారు. పనులు అవసరమైన వారికి జాబ్‌కార్డులు ఇచ్చి మరీ పనులు కల్పించాలని ఏపీవో ఎం.గౌరీనాథ్ తెలిపారు.

తాగునీటి సదుపాయం కల్పించండి

భామిని: తాగునీటి సదుపాయం కల్పించాలని మండలంలోని సన్నాయికాలనీ వాసులు కోరుతున్నారు. కాలనీలో ఉన్న ఒకేఒక నుయ్యి నీరు సరిపోవడం లేదని, వేసవిలో నుయ్యి ఎండిపోయి నీరు దొరికే పరిస్థితి ఉండడం లేదన్నారు. రక్షిత మంచినీటి పథకం నిర్మించి ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జ్ఞాన సముపార్జనకు విజ్ఞాన యాత్రలు దోహదం



ఇండస్ట్రియల్ టూర్‌కు బయలుదేరి వెళ్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: జ్ఞాన సముపార్జనకు విజ్ఞానయాత్రలు ఎంతగానో దోహదపడతాయని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎల్.పాత్రుడు అన్నారు. స్థానిక పాఠశాల విద్యార్థులను ఇండస్ట్రియల్ టూర్‌కు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సు విద్యార్థులు పరిశ్రమలు, బ్యాంకింగ్ నిర్వహణకు సంబంధించిన అంశాలు తెలుసుకునేలా ఈ టూర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో పరిశ్రమల స్థాపనకు, చిన్నతరహా పరిశ్రమల నిర్వహణకు అవసరమైన విజ్ఞానం ఈ టూర్ ద్వారా దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, రవీంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కొమరాడ: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ నీలకంఠం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల బారి నపడకుండా అనుసరించాల్సిన విధానాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది యువత తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లు విద్యార్థులు, యువతీయువకులు దూరంగా ఉండాలన్నారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.



పాలకొండ: మాజీ ఎమ్మెల్యే కళావతి ఆధ్వర్యంలో ర్యాలీకి బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, నాయకులు

బాబు మార్కు..

ప్రజలకు కరెంట్ షాక్!

- కూటమి హయాంలో కరెంట్ చార్జీల బాదుడే బాదుడు
- విద్యుత్ ధరల పెంపుపై వైఎస్సార్ సీపీ పోరుబాట విజయవంతం
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ భారీ ర్యాలీ
- పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారుల హాజరు
- తక్షణమే పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్

పాలకొండ:

విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పేరిట కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం చేపట్టిన కార్యక్రమం విజయవంతమైంది. మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి.. స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం నివాసం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఏలాం జంక్షన్ మీదుగా విద్యుత్ శాఖ కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీలో పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని, కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడమేంటని ప్రశ్నించారు. సంపద సృష్టించడమంటే ఓ వైపు నిత్యావసరాల ధరలు, మరోవైపు కరెంట్ చార్జీలు పెంచడమా అని నిలదీశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని జనాలకు పథకాల ఆశ చూపి, మోసం చేయడం తగదన్నారు. అనంతరం డీఈఈ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు పెంచిందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల కాలంలో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. కూటమి మోసాలను ఎండగట్టేందుకే పార్టీ తరఫున పోరుబాట పట్టామని, ఎన్నికల హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలిచి, వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి దోచుకోవడమేనా సంపద సృష్టి..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నుంచి దోచుకోవడమేనా సంపద సృష్టి అని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి నిలదీశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ కురుపాం నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులంతా తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని, ఏడీ ఎం.రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, సామాన్య ప్రజలకు కరెంట్ షాక్ కొట్టేలా చేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచార సమయంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ అన్నారని, అయితే ఇప్పుడు అది బాబు ష్యూరిటీ బాదుడు గ్యారంటీ అయిందని ఎద్దేవా చేశారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడితే ఉచితమని, ఇప్పుడు 100 యూనిట్లు వాడితే రూ.వేలల్లో విద్యుత్ బిల్లు వస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా మోసపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

ఎన్నికల హామీలు అమలు చేసేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఇదివరకు ఇచ్చిన ఉచిత విద్యుత్ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తివేయడంతో ఆయా వర్గాల ప్రజలపై పెనుభారం పడిందన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీలు కుంబురుక దీనమయ్య, శెట్టి పద్మావతి, ఉరిటి రామారావు, శెట్టి శ్యామల, జెడ్పీటీసీలు ఎం.రాధిక, డి.లక్ష్మి, జి.సుజాత, శశికళ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఏడీ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న పార్టీ నాయకులు



పాలకొండ: డీఈఈ కృష్ణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

10 యూనిట్లకు రూ.వందల్లో బిల్లులు..



కూటమి ప్రభుత్వ హయాంలో 10 యూనిట్ల విద్యుత్ కాల్చినా రూ.వందల్లో బిల్లులు వస్తున్నాయి. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తే ఉచితం. ఎన్నికలప్పుడు కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు పెంచడం ఎంతవరకు సమంజసం.
–కుంబురుక దీనమయ్య, ఎంపీపీ, గుమ్మలక్ష్మీపురం

విద్యుత్ చార్జీల పెంపు విరమించుకోవాలి..



కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి. ప్రజలపై విద్యుత్ భారం పడకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజలపై విద్యుత్ భారం పడకుండా చూడాలి.
–మరిచర్ల బాపూజీనాయుడు, ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్

దుర్మార్గమైన చర్య..



విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు పెంచడం దుర్మార్గమైన చర్య. పెరిగిన కరెంట్ చార్జీలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడడం ఖాయం. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా ప్రభుత్వం వెనక్కి తగ్గకపోవడం మూర్ఖత్వమే.
టి.లక్ష్మణరావు, విద్యుత్ వినియోగదారుడు, వడమ

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి..



వైఎస్సార్ సీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ సదుపాయం ఇప్పుడు కూడా ఇవ్వాలి. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను కూడా విద్యుత్ బిల్లులు కట్టాలని చెబుతుండడం దారుణం. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉన్న వాటిని కూడా తీసేయడం బాధాకరం. –ఎ.లిల్లీ పుష్పనాథం, పాలకొండ

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



గరుగుబిల్లి: వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ భరత్

కొమరాడ: రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దారు శివయ్య తెలిపారు. మండలంలోని నందాపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ మణిరామ్‌తో కలిసి హాజరైన ఆయన.. పలువురు రైతులు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. రైతుల అర్జీల్లో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మొత్తం 15 దరఖాస్తులు వచ్చాయన్నారు.



కొమరాడ: రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

గరుగుబిల్లి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ సదుపాయాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు పి.బాల కోరారు. మండలంలోని రావివలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన పలువురు రైతులు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.అప్పడు, ఎంపీటీసీ కె.భరత్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పాడైన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి: మండలంలోని సుంకి గ్రామంలో ఇటీవల ఏనుగులు ధ్వంసం చేసిన వరి, అరటి పంటలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం పరిశీలించారు. పంట కోల్పోయిన రైతులను ఆదుకోవాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగును తెచ్చి, ఏనుగుల గుంపును తరలించే ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు. అంతవరకు ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తమనాయుడు, ఎం.తవిటినాయుడు, ఎ.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది..



పాలకొండ రూరల్: మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక పట్టణంలో శుక్రవారం సంతాప సభ చేపట్టి, మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలు కొనియాడారు. ఆయన తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కనపాక సూర్యప్రకాష్, పాలవలస దవళేశ్వరరావు, లిల్లీ పుష్పనాథం పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి ప్రిన్సిపాల్ సుశాంత్ జనాతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అంతా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మన్మోహన్‌సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ కురుపాం కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షించిన గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ఆయన లేని లోటు ఎవరూ పూడ్చలేనిదన్నారు.

సకాలంలో ప్రజలకు సేవలందించాలి

పాలకొండ రూరల్: సచివాలయాలకు వస్తున్న ప్రజలకు వారికి అవసరమైన సేవలను సకాలంలో అందించాలని డీఎల్‌పీవో రామ్‌ప్రసాద్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలోని సచివాలయాల సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన.. పంచాయతీ రాజ్–1 యాప్ వినియోగం, విధివిధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సచివాలయ పరిధిలో రోజువారీ కార్యాకలాపాలను సదరు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.

30 నుంచి ఎస్‌ఎంసీ సభ్యులకు శిక్షణ

వీరఘట్టం: ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యులకు ఈ నెల 30వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారులు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 30న జిల్లా స్థాయిలో 31న మండల స్థాయిలో, 2025 జనవరి 4వ తేదీన పాఠశాల స్థాయిలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. మండలానికి చెందిన ఉపాధ్యాయులు కె.జనార్ధనరావు, కె.గోవిందరావులు కేఆర్‌పీలుగా, డి.జె.నాయుడు, ఎ.వెంకటరావు, శ్రీహరినాయుడులు డీఆర్‌పీలుగా వ్యవహరిస్తారన్నారు.

శ్రమదానం

భామిని: మండలంలోని పాలవలస వెళ్లే దారిలో ఏర్పడిన గోతులను గిరిజనులు శ్రమదానం చేసి మరీ శుక్రవారం పూడ్చివేశారు. రోడ్డు పొడవునా ఏర్పడిన గొయ్యిలు, రంధ్రాలతో అటువైపుగా వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన కొంత మంది గిరిజనులు సమష్టిగా శ్రమించి, గోతుల్లో మట్టి నింపి చదును చేశారు. దీంతో ఆ దిశగా ప్రయాణానికి మార్గం సుగమమైంది.

బీజేపీ మండల అధ్యక్షుడిగా అశోక్

గరుగుబిల్లి: మండల బీజేపీ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి అశోక్ ఎంపికయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఎన్నికలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెంట సురేష్, టి.శంకరరావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన..ఆస్పత్రిలో మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న వైద్యంపై ఆరాతీశారు. పాముకాటు, కుక్కకాటు మందులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి, అక్కడి లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



బడ్జెట్ వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీవో విజయరంగారావు

పాలకొండ: మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో విజయరంగారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల బడ్జెట్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. రూ.10265167ల అంచనా బడ్జెట్‌ను ఎంపీడీవో ప్రవేశపెట్టగా, సభ్యులు ఆ బడ్జెట్‌ను ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు నిధులు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామన్నారు. మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు పనులు కేటాయించాలని కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశరావు సూచించారు. సమావేశంలో ఎంపీపీ బి.భాను తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5 నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



ప్రచార యాత్రలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) ఆవిర్భవించి, యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2025 జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ తెలిపారు. ఇదే విషయమై చేపట్టిన ప్రచార యాత్ర శుక్రవారం సీతంపేటకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటైన యూటీఎఫ్ తన ఐదు దశాబ్దాల ప్రయాణంలో ఎన్నో పోరాటాలు సాగించి, గొప్ప గుర్తింపు పొందిందన్నారు. కాకినాడలో జరిగే స్వర్ణోత్సవాల మహాసభకు పెద్దసంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.మురళి, మోహన్‌రావు, ఎ.భాస్కరరావు, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై దృష్టి సారించండి



రక్తహీనతతో బాధపడే వారి వివరాలపై ఆరాతీస్తున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ: మండలంలోని కొండాపురం హెల్త్ సెంటర్‌ను సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. అక్కడి రికార్డులు పరిశీలించి, రక్తహీనతతో బాధపడుతున్న తల్లీబిడ్డల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చిన్నారులకు ఎప్పటికప్పుడు వైద్య తనిఖీలు చేపట్టి, అవసరమైన మందులు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి కమలనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర ఎస్‌ఆర్‌పీ దేవుళ్లు

సీతంపేట: మండలంలోని దిగువకలువరాయి, బుడగరాయి, దంజుపాయి, కుశిమి తదితర గ్రామాల్లోని రైతులకు అంతర పంటల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర ఎస్‌ఆర్‌పీ దేవుళ్లు.. ప్రకృతి సాగు పద్ధతులు అనుసరించి, అధిక దిగుబడులు ఏ విధంగా సాధించవచ్చన్న విషయాలను వివరించారు. గులిరాగి పద్ధతిలో అధిక దిగుబడుల సాధన, వివిధ కషాయాల తయారీ వంటి విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో డీపీఎం షణ్ముఖరాజు, ఎస్ఎఫ్ఏ మునలయ్య తదితరులు పాల్గొన్నారు.